# తీరు!

వాతావరణం చాలా చమత్కారంగా వుంది. నీడలో ఉంటే చలివేస్తోంది. చలిగా వుందని కాసేపు ఎండలో నిలబడితే, బుర్ర చుర్రుమంటోంది. ఈ వైపరీత్యం భరించలేక, కాస్సేపు కబుర్లాడి వద్దామని చంద్రమ్మగారింటికి చాంద్రాయణం బయలుదేరింది సుందరమ్మగారు.

మాట్లాడుతూ, మధ్యలో చంద్రమ్మగారి కూతురి కొత్తకాపురం ఎలా వుందని అడిగింది.

"దానికేమమ్మా! నిక్షేపంలా వుంది" వెంటనే అందుకుంది చంద్రమ్మగారు. "మా అల్లుడు మేలిమి బంగారం అనుకో!" దానిని కాలు కింద పెట్టనివ్వడంతే! అన్ని పనులూ తనే చూసుకుంటాడు పాపం. పొద్దున్నే లేచి పాలు పోయించుకుంటాడు, పనిమనిషికి అంట్లు వేస్తాడు, వాకిట్లోకి కూరలొస్తే బేరమాడి కొంటాడు. ఇది లేచేటప్పటికి కాఫీ కాచి, తను తాగి దానికిస్తాడు. దానికి ఒంట్లో కొంచెం నలతగా వుంటే వంట తనే చేస్తాడు. ఒకటా, రెండా అతని సుగుణాలు! ఎన్నని చెప్పను తల్లీ! పక్కలు కూడా అతనే దులిపి వేస్తాడు. స్వతహాగా జాగ్రత్తమంతుడవడంతో తలుపులూ, గడియలూ అవీ తనే చూసుకుంటాడు. దీని కసలే మతిమరుపాయె! అందుకని రాత్రికి పాలు కూడా అతనే తోడు వేస్తాడు.

చిన్నప్పుడు సరదాకి కుట్లు అల్లికలు నేర్చుకున్నాడట. అందుకని తీరుబడిగా ఉన్నప్పుడు, ఇస్త్రీ చెయ్యడమే కాకుండా ఆ పనులు కూడా చేస్తాడు. పది మాటలెందుకమ్మా!

నే చూశాగా, అవసరమైతే దాని కాళ్ళు కూడా పిసుకుతాడు. బంగారం కాదుటమ్మా, మేలిమి బంగారం. ఆడదాని కష్టం సుఖం తెలిసిన వాళ్ళు ఎంత మందుంటారు. నూటికి ఒకళ్ళుంటారు. మా అల్లుడు లాంటివాడు.

చంద్రమ్మ గారి కూతురికి మంచి మొగుడు దొరికినందుకు సంబరపడింది సుందరమ్మగారు.

ఆ కబుర్లూ, ఈ కబుర్లూ మరి కాస్సేపు మాట్లాడి లేవబోతూ, పెళ్ళయిన వెంటనే ట్రాన్స్‌ఫర్ అయి, పొరుగూరులో కొత్తగా కాపురం పెట్టిన చంద్రమ్మగారి కొడుకు గురించి అడిగింది.

పొన్నూరు పోట్లగిత్తల్లే పెద్దగా నిట్టూర్చి, "వాడో చవట" అంది చంద్రమ్మగారు.

విస్తుపోయింది సుందరమ్మగారు. చంద్రమ్మగారే అందుకుని, మాకోడలో రణపెంకెలే! పెందరాళే నిద్దుర్లేవదు ఆవిడగారు! అందుకని మా చవటే పాలు పోయించుకోవాలి. పనిమనిషికి అంట్లు వెయ్యాలి, వాకిట్లో కూరలు బేరమాడి కొనాలి.



మాయరోగమా, కాఫీ కూడా వీడే కాస్తాట్ట. చవటాని చవట. వంటకూడా చేస్తాడు కాబోలు, ఆవిడగారి బద్ధకానికి తోడు జాగ్రత్త కూడా అంతంత మాత్రమేలే! అంచేత పక్కలు దులిపి వెయ్యడం, గడియలు చూసుకోవడం అన్నీ వీడే!

వీటికి తోడు ఈ మధ్య టైలరింగు నేర్చుకున్నాట్ట కొన్నాళ్ళు. దాంతో అమ్మగారు మరీ నెత్తికెక్కింది. కరెంటు అంటే ఆవిడగారికి భయం అందుకని ఇస్త్రీ కూడా వీడే చెయ్యాలి. రామ రామ! మొన్న ఖర్మగాలి చూడరాని దృశ్యమే చూశాను సుందరమ్మ తల్లీ! గుడిమెట్లు ఎక్కిందట. కాళ్ళు నొప్పిట. వద్దంటూ అది వగలమారి తనం పోవడం, మా చవట కాలు అందిపుచ్చుకుని మరీ పిసకడం. రామచంద్రా! రామచంద్రా! కోటికి ఒక్కడున్నా చాలమ్మా ఇల్లాంటి చవట".

నవ్వుకుంటూ లేచి వెళ్లిన సుందరమ్మగారికి, మధ్యాహ్నపు టెండ ఎంతో ఆహ్లాదకరంగా కనిపించింది.